క్లుప్తంగా

క్రెడెన్స్ వరల్డ్ రికార్డ్స్‌లో నిటలాక్ష రామకు చోటు



ప్రశంసాపత్రాన్ని అందుకున్న నిటలాక్షరామ

కొయ్యలగూడెం: క్రెడెన్స్ బుక్స్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో కొయ్యలగూడానికి చెందిన మూడేళ్ల బాలుడు దాసరోజు నిటలాక్ష రామ స్థానం సంపాదించినట్లు తండ్రి శ్రీకాత్యాయనీ పీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ దాసరోజు శ్రీనివాసరావు ఆదివారం పేర్కొన్నారు. వేద ప్రామాణికంగా మానవ శరీరంలో ఉండే షట్చక్రాల పేర్లు, వాటి అధిష్టాన దేవతల పేర్లు, కుండలినీ ప్రేరేపణ గురించి వివరించినందుకు క్రెడెన్స్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కిందన్నారు. రాజమండ్రిలోని ప్రైవేట్ పాఠశాలలో నిర్వాహకులు ప్రశంసాపత్రం అందజేశారు. డి.యోగానంద్, అప్పలభక్తుల శివకేశవరావు, రాజమండ్రి ఆర్ట్స్ కాలేజి విశ్రాంత బోటనీ అధ్యాపకురాలు జీవీపీ బాలామణి బాలుడికి అభినందనలు తెలిపారు.

తాత్కాలిక మరమ్మతులకు మండల పరిషత్ నిధులు



కన్నాపురంలో తాత్కాలిక అభివృద్ధి పనులు ప్రారంభించిన దృశ్యం

కొయ్యలగూడెం: కన్నాపురం పంచాయతీ పరిధిలో తాత్కాలిక మరమ్మతు పనులకు నిధులు విడుదల చేసినట్లు ఎంపీపీ గంజిమాల రామారావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఆయా పనులను ప్రారంభించారు. కన్నాపురం, యర్రాయిగూడెం తూర్పు కాలవపైన కల్వర్టు ఇటీవల వచ్చిన వరదలకు ధ్వంసం అయింది. అదేవిధంగా ఎస్సీ కాలనీ శ్మశాన వాటిక రోడ్డు గుంతలు పడడంతో మండల పరిషత్ సమావేశంలో ఆ గ్రామ ఎంపీటీసీలు ఈ సమస్యలపై ప్రస్తావించారు. ఈ రెండు పనుల అభివృద్ధి నిమిత్తం రూ.3 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘంటసాల సాయికుమార్, ఎంపీటీసీలు ఎస్కే బాజీ, కె.గణపతి, జాన్ డేవిడ్ పాల్గొన్నారు.

కల్వర్టులో చెత్త తొలగింపు



జల్లేరు వాగు కల్వర్టు తూరల్లో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం సమీపంలోని జల్లేరువాగు ప్రవాహంతో కల్వర్టు తూముల్లో చిక్కుకున్న చెత్తను గ్రామస్తులు అల్లూరి రత్నాజీ ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఈ కల్వర్టు కొంత భాగం కొట్టుకుపోవడంతో ఆ కల్వర్టుపై వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీనికి తోడు కల్వర్టు తూరల్లోకి చెత్తాచెదారం పేరుకుపోవడంతో మరింత ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామస్తుల శ్రమదానంతో చెత్తను తొలగించారు.


వైఎస్సార్ సీపీ నేత భాగ్యంకు నివాళి



భాగ్యంకు సంతాపం తెలుపుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: జీలుగుమిల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు గొడెల్లి భాగ్యం ఇటీవల మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్, ఎంపీపీ కోర్సా పోచమ్మ, పార్టీ సీనియర్ నాయకులు బోదా శ్రీనివాసరెడ్డిల ఆధ్వర్యంలో శనివారం పరామర్శించారు. భాగ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆమె వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని, ఆమె మరణం పార్టీకి తీరనిలోటని అన్నారు. అనంతరం ఆమె భర్త చంద్రరావుకు బియ్యం, నగదు, ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ పరంగా అండగా ఉంటామని భరోసా చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కక్కిరాల చక్రి, కొప్పుల సత్యనారాయణ, బూరుగు ప్రేమ్‌కుమార్, చిట్టిబొమ్మ శ్రీను, కుసుమ వెంకట్, కొప్పుల ప్రసాద్, గంగుల రమేష్ పాల్గొన్నారు.

పారిజాతగిరిలో పూజలు



జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం తొలి శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక దర్శనాలు, అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. నరసన్నపాలెం గ్రామస్తులు కాలినడకన కొండపైకి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు భక్తులకు దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాలను ఈవో మానికల రాంబాబు పర్యవేక్షించారు.

ట్రాఫిక్ రూల్స్.. పాటిస్తేనే సేఫ్

- ముమ్మరంగా వాహనాల తనిఖీలు
- హెల్మెట్ లేనివారికి ఈ చలానాలు
- వాహనదారులకు పోలీస్ కౌన్సెలింగ్

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో ఏలూరు–చింతలపూడి ప్రధాన రహదారిపై పోలీసులు శనివారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక పెట్రోలు బంక్‌ల సమీపంలో ఈ తనిఖీలు చేపట్టి సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ సుధాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానాలు కూడా విధించినట్లు చెప్పారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనాల ధ్రువీకరణ పత్రాలు, లైసెన్స్‌లు, ఇన్సూరెన్స్ పత్రాలు వెంట కలిగి ఉండాలని చెప్పారు. రోడ్లపై ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, లారీలు, ఆటోలు కూడా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్ వాడకంపై సీఐ సుధాకర్, ఎస్సై కుటుంబరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. తనిఖీల్లో ఎస్సై కుటుంబరావు, స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కొయ్యలగూడెం: జాతీయ ప్రధాన రహదారిపై వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ, సీఐ

విజువల్ పోలీసింగ్

కొయ్యలగూడెం: విజువల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా శనివారం కొయ్యలగూడెంలోని జాతీయ ప్రధాన రహదారిపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం పోలవరం డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డి, సీఐ మధుబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలకు చలానాలు విధించడంతోపాటు రక్షణ జాగ్రత్తల గురించి వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరు కూడా హెల్మెట్ ధరించాలని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను సక్రమంగా ఉంచుకోవాలని వాహనదారులను హెచ్చరించారు.

25 మందికి ఈ చలానాలు

పోలవరం రూరల్: పోలవరం మండలం కన్నాపురం అడ్డరోడ్డు వద్ద పోలీసులు వాహనాలను విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, సిబ్బందితో కలిసి శనివారం రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. 25 మంది వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ అతిక్రమణపై ఈ–చలానాలు విధించినట్లు చెప్పారు. మోటార్‌సైకిల్ నడిపే వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అవగాహన కల్పించారు.

61 వాహనాల సీజ్

జంగారెడ్డిగూడెం: పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో డీఎస్పీ యు.రవిచంద్ర ఆధ్వర్యంలో శనివారం వాహన తనిఖీలు చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు, అక్రమ మద్యం రవాణా నివారించే క్రమంలో జాతీయ ప్రధాన రహదారిపై లారీలు, వ్యాన్, కార్లు, మోటార్‌సైకిళ్లను విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 61 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. జంగారెడ్డిగూడెంలో 44, లక్కవరం 1, చింతలపూడి 16 ద్విచక్రవాహనాలను సీజ్ చేసి రూ.65,225 జరిమానా విధించినట్లు చెప్పారు. సీఐ పి.రాజేష్, ఎస్సైలు జి.జ్యోతిబాస్, సుధీర్, ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

కుక్కునూరు: మండలంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎస్సై రామకృష్ణ సిబ్బందితో కలిసి పెట్రోల్ బంక్ సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారుల లైసెన్సులను పరిశీలించి, హెల్మెట్‌లు ధరించాలని సూచించారు. మైనర్లకు, లైసెన్సులు లేని వారికి వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. తనిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపూడి: వాహనదారులకు హెల్మెట్ వాడకంపై కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ సుధాకర్, ఎస్సై కుటుంబరావు



కుక్కునూరు: కుక్కునూరు మండలంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది



పోలవరం రూరల్: కన్నాపురం అడ్డరోడ్డు వద్ద వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై పవన్‌కుమార్

ధాన్యం బకాయిలు చెల్లించండి

జంగారెడ్డిగూడెం రూరల్: ధాన్యం విక్రయించిన రైతులకు పూర్తిస్థాయిలో బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, రైతు సంఘం నాయకులు వామిశెట్టి హరిబాబు అన్నారు. మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తోలిన ధాన్యానికి ఇప్పటివరకు ప్రభుత్వం రైతులకు పూర్తిస్థాయిలో నగదు జమ చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ రావడంతో సాగు చేపట్టేందుకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. వడ్డీలకు అప్పు తెచ్చి రైతులు వరి సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. నాలుగు నెలలు కావస్తున్నా నేటికీ ధాన్యం బకాయిలు పూర్తిగా జమ చేయలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో ధాన్యం బకాయిలు చెల్లించాలని వాసుబాబు కోరారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వివాహిత అదృశ్యంపై తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కామవరపుకోట మండలం రావికంపాడు గ్రామానికి చెందిన షేక్ ఆశ బీబీకి వివాహమై ఇద్దరు సంతానం ఉన్నారు. భర్తతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీన ఆశ బీబీ జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలోని పుట్టింటికి వచ్చింది. 8వ తేదీన ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి షేక్ మీరాబీ లేచి చూడగా, కుమార్తె కనిపించకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇంటి వద్ద వెదికినా ఆచూకీ లేకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

భూమి కబ్జా చేశారంటూ నిరసన

జంగారెడ్డిగూడెం రూరల్: బినామీల పేర్లతో, అధికారుల అండతో తనకు చెందిన భూమిని కబ్జా చేశారని, తనకు న్యాయం చేయాలంటూ మండలంలోని మైసన్నగూడెంలో గుద్దటి భూలక్ష్మి, ఆమె కుటుంబ సభ్యులు శనివారం నిరసన చేపట్టారు. భూలక్ష్మి మాట్లాడుతూ మైసన్నగూడెంలో సర్వేనెంబర్ 120/2 లో ఉన్న 2 ఎకరాల 13 సెంట్ల మెట్ట పోరంబోకు భూమిలో ఉన్న జీడి తోటను పూర్వం నుంచి సాగు చేసుకుంటూ జీవిస్తున్నామన్నామన్నారు. 2008 సంవత్సరంలో తన తల్లి పిల్లి అచ్చమ్మ పేరు మీద అప్పటి ప్రభుత్వం డి.నమూనా పట్టా అందజేయడం జరిగిందన్నారు. ఈ భూమిని ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్, వీఆర్వో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్జీలు అందజేసినా ఆన్‌లైన్ చేయలేదన్నారు. ఇటీవల కాలంలో తమకు ఇచ్చిన ఈ భూమిని కబ్జా చేసి బినామీల పేర్లతో పంచాయతీ తీర్మానం చేసి పట్టాలు పంపిణీ చేసిన చర్యలకు రెవెన్యూ, పంచాయతీ అధికారులు, ప్రెసిడెంట్ పాల్పడ్డారని భూలక్ష్మి తెలిపింది. తన వద్ద ప్రభుత్వం ద్వారా తహసీల్దార్ అందజేసిన డి.నమూనా పట్టా ఉందన్నారు. నిరసన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఏలూరు జిల్లా కలెక్టర్ బాధితులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఫోన్ ద్వారా కలెక్టర్‌కి వివరించామని, సోమవారం కార్యాలయానికి పట్టాలతో రావాలని, న్యాయం చేస్తామని సూచించినట్లు భూలక్ష్మి తెలిపింది.



మైసన్నగూడెంలో నిరసన చేపట్టిన భూలక్ష్మి కుటుంబ సభ్యులు

రాజద్రోహంగా పరిగణించాలి

కొయ్యలగూడెం: ప్రపంచానికే గర్వకారణంగా నిలిచిన అంబేడ్కర్ మహాశయునికి జరిగిన అవమానాన్ని రాజద్రోహంగా ప్రభుత్వం పరిగణించి ద్రోహులపై చర్యలు చేపట్టాలని అంబేడ్కర్ సేవా సంఘాలు డిమాండ్ చేశాయి. గవరవరం అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. ఇందుకు కారకులైన వారు ఏ పార్టీకి చెందిన వారు అయినప్పటికీ నిష్పక్షపాతంగా ప్రభుత్వం వ్యవహరించి ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా జాతీయ నాయకుల విగ్రహాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయటం హేయమైన చర్య అని అన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీటీసీ బిరుదుగట్ల రత్నకుమారి, అంబేడ్కర్ అభిమాన సంఘాల సభ్యులు కోసూరి అఖిల్, బిరుదుగట్ల రాజు, జుమాల రమణ, దండే బద్రి, దండే రామారావు, కోనాల వెంకట్రావు, కరుటూరి సూరి, కరటూరి కిషోర్ కుమార్, బిరుదుగట్ల, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గవరవరం అంబేడ్కర్ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సేవా సంఘాలు

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలోని యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎంవీ శ్యాంబాబు యూటీఎఫ్ జెండా ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఈ 50 సంవత్సరాల్లో యూటీఎఫ్ సాధించిన విజయాలను కార్యకర్తలకు వివరించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, మండల ప్రధాన కార్యదర్శి టి.రామకృష్ణ, జీలుగుమిల్లి మండల అధ్యక్షురాలు మడకం పోసమ్మ, నాయకులు ఐవీఎస్ఆర్‌కె ప్రసాద్, ఎస్.ఏసురత్నం, సోమేశ్వరరావు, అజ్గర్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. పరింపూడి ఉపాధ్యాయ సొసైటీ కార్యాలయం వద్ద పతాకావిష్కరణ చేశారు. జీవో 117 రద్దు చేయాని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యూటీఎఫ్ అవిశ్రాంత పోరాటం చేస్తోందని నాయకులు రాయపూడి వెంకటరమణ పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎస్.రమేష్, ఎ.విక్టర్, బీవీ రావు, ఎం.ఈశ్వర్, నాగకృష్ణ, అలెగ్జాండర్, పి.శ్రీనివాస్, లక్ష్మీప్రసాద్, వరప్రసాద్, పాండురంగ, అనిల్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో యూటీఎఫ్ జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

ఎస్ఎంసీ కమిటీలకు అభినందనలు

జంగారెడ్డిగూడెం రూరల్: నూతనంగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీలు పాఠశాలల అభివృద్ధికి తోడ్పడాలని, డ్రాప్‌ఔట్స్ లేకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు అన్నారు. పేరంపేట ఎంపీపీ స్పెషల్ పాఠశాలలో జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీలో ఎన్నికైన చైర్మన్ వింజమూరి రాజు, వైస్ చైర్మన్ కంకిపాటి మేరీ, కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇర్ల విజయశాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇర్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: కన్నాపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఎస్ఎంసీ కమిటీ ఎన్నికల్లో కమిటీ చైర్మన్‌గా ముప్పిడి కనిష్ట, వైస్ చైర్మన్‌గా సుందరపల్లి శ్రావణిను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులచే ప్రధానోపాధ్యాయులు క్రిస్టఫర్ ప్రమాణ స్వీకారం చేయించి వారికి అభినందనలు తెలిపారు.



ఎన్నికైన ఎస్ఎంసీ కమిటీ సభ్యులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత జెట్టి గురునాథరావు

రైతుల భూములకు సాగునీరు అందించాలి

ఆయకట్టు రైతుల సమావేశంలో రైతు సంఘ నేత శ్రీనివాస్

ద్వారకాతిరుమల: తాడిపూడి ఎత్తిపోతల పథకం కాలువల పనులు వెంటనే పూర్తి చేయాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎం.నాగులపల్లిలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం ఆవరణలో శనివారం తాడిపూడి ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతుల సమావేశాన్ని నిర్వహించారు. రైతు గారపాటి చంద్రరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కె.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని, రైతు సమస్యలపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని 2 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే తాడిపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తికాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లు సక్రమంగా పనిచేయక అనేక సందర్భాల్లో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తాడిపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేసేందుకు నిధులు కేటాయించాలని కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, మండల అధ్యక్షుడు బోయపాటి సత్యనారాయణ మాట్లాడుతూ ఈనెల 12న మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఆయకట్టు రైతులతో సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతులు వీరవల్లి సత్యనారాయణ, గోవాడ గోపాలం, గుర్రం రాంబాబు, ఈడే మురళీకృష్ణ, పోలుకొండ నాగరాజు, ఎంట్రపాటి రాజు, మద్ది రాముడు, చల్లగాలి వీరభద్రం, వై.త్రిమూర్తులు, గారపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆయకట్టు రైతుల సమావేశంలో ఐక్యంగా పోరాడాలని చేతులు కలిపిన రైతులు

వీడని వరద భయం

భద్రాచలంలో నీటిమట్టం తగ్గినా వీడని వరద

వేలేరుపాడు: భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం శనివారం రాత్రి 8.30 గంటలకు 31.1 అడుగులకు చేరుకున్నా వేలేరుపాడు మండలంలో గిరిజన గ్రామాలకు గోదావరి వరద భయం ఇంకా తొలగిపోలేదు. శబరి ఎగపోటు, పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ వల్ల వేలేరుపాడు నుంచి కొయిదా వెళ్లే రహదారిలో ఎద్దెలవాగు వంతెన, టేకూరు వాగుల వద్ద వంతెనలు నీటమునిగే ఉన్నాయి. దీంతో గత 22 రోజులుగా వేలేరుపాడు మండలంలో దిగువనున్న 18 గిరిజన గ్రామాలు జలదిగ్బంధనంలోనే ఉన్నాయి. ఎద్దెలవాగు, టేకూరు వాగుల వద్ద పడవలపైనే ప్రయాణం సాగిస్తున్నారు. పెద్దవాగు పొంగి ప్రవహిస్తుండటంతో వాగు వెంబడి ఉన్న కమ్మరిగూడెం, ఒంటిబండ, రామవరం ఊటగుంపు, తదితర గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయి 24 రోజులు అవుతోంది. వాగు ప్రవాహానికి గ్రామాల నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. వర్షాల వల్ల వస్తున్న వరదను నియంత్రించేందుకు ప్రాజెక్ట్‌కు గేట్లు కూడా లేకపోవడంతో నిత్యం వరద నీరు వాగులో ప్రవహిస్తోంది. అల్లూరినగర్ గ్రామస్తుల పొలాలన్నీ అవతలి ఒడ్డున ఉన్న ఒంటిబండలో ఉండటంతో ఆ గ్రామస్తులు ప్రత్యామ్నాయ మార్గంలేక ప్రాణాలకు తెగించి పీకల్లోతు వాగు నీటిలోనే రాకపోకలు సాగిస్తున్నారు.



పెద్దవాగు దాటుతున్న కమ్మరిగూడెం గ్రామస్తులు

కొత్త పట్టిసీమలో పారిశుధ్య పనులు

పోలవరం రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీ పరిధిలో నిలిచిపోయిన వర్షం నీటిని మళ్లించే కార్యక్రమం చేపట్టారు. శనివారం సర్పంచ్ మైగాపుల విజయదుర్గ, పంచాయతీ కార్యదర్శి విజయకుమారి, వీఆర్వో నెప్రూలాలు గ్రామంలోని వీధుల్లో పరిస్థితిని పరిశీలించారు. ఇళ్ల మధ్య, రోడ్లపై ఎక్కడికక్కడ వర్షం నీరు నిలిచిపోవడంతో జేసీబీ మిషన్‌తో కచ్చా డ్రెయిన్‌లు తీయించి నీరు మళ్లించారు. కొన్ని ప్రాంతాల్లో ఆయిల్ ఇంజిన్‌లు ఏర్పాటు చేసి భారీ ట్యూబ్‌ల ద్వారా నీటిని తొలగించి పనులు చేశారు. గ్రామాల్లో వర్షం నీటిని తొలగించిన వెంటనే బ్లీచింగ్ చల్లి శానిటేషన్ పనులు చేపట్టారు. ఎక్కడా దుర్వాసన లేకుండా వీధులు శుభ్రంచేసే పనులు చేస్తున్నారు.





కొత్తపట్టిసీమ గ్రామంలో నిలిచిన వర్షం నీరు, జేసీబీతో కచ్చా డ్రెయిన్‌లు తీస్తున్న దృశ్యం ➤

ఉపాధి హామీ అవకతవకలపై విచారణ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అందుగుల ప్రభాకరరావు

జంగారెడ్డిగూడెం: మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు డిమాండ్ చేశారు. శనివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం మండల అధ్యక్షురాలు యాగంటి సీతా అధ్యక్షత వహించగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, మండల కార్యదర్శి అందుగుల ప్రభాకరరావు పాల్గొని మాట్లాడారు. పనిచేసిన వారికి పే స్లిప్పులు ఇవ్వడం లేదని, అక్రమ పద్ధతిలో పనికి మస్తర్లు వేసుకున్నారని మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనిచేసే చెరువుల్లో జేసీబీ ట్రాక్టర్లతో మట్టి తోలకాలు తోలి రియల్ ఎస్టేట్లు వ్యాపారులకు ఉపాధి హామీ అధికారులు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. అలాగే మండల వేతన బకాయలు ఇవ్వాలని పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టినప్పటికీ తాత్సారం చేస్తున్నారే కానీ ఉపాధి కూలీలకు ప్లే స్లిప్పులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. జిల్లా అధికారులు పరిశీలన చేసి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, పిల్లి చంటి, కె.సుబ్బారావు, వామిశెట్టి నరసరావు, కలపాల వెంకటేష్, నిట్ట నాగరాజు, బొబ్బిలి గంగరాజు తదితరులు పాల్గొన్నారు.